ప్రతీ నెలా రూ.1500 అన్నారు.. ఏదీ?



ఎన్నికల ప్రచారంలో కూటమి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ అని చంద్రబాబు 18 ఏళ్లు నిండిన మహిళకు ప్రతీ నెలా రూ.1500 ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 100 రోజులు కావస్తోంది. ఇప్పటి వరకు రూ.1500 ఊసే లేదు. హామీలు నమ్మి చంద్రబాబును గెలిపించాం. గెలిచిన తర్వాత హామీని నిలబెట్టుకోలేదు. గతంలో లాగా దొంగ హామీలను ఇచ్చి మోసం చేస్తే గట్టిగా బుద్ధి చెబుతాం. కూటమిలో ఉన్న మిగతా పార్టీల నాయకులు చంద్రబాబుకు దాసోహం అయ్యారా. చంద్రబాబు మోసంలో తలా పిడికెడు పంచుకుంటున్నారా. ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

– జి.అరుణ కుమారి, గుడివాడ అప్పన్నకాలనీ

తల్లికి వందనం ఇవ్వకపోతే ఎలా?



నాకు ఇద్దరు పిల్లలు, పాప, బాబు ఉన్నారు. నా కుమార్తె 4వ తరగతి, కుమారుడు 5వ తరగతి ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. కొత్త ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద ఇంతవరకూ డబ్బులు జమ చేయలేదు. నాకు ఇప్పుడు రూ.30వేలు వస్తాయని ఎదురు చూస్తున్నాను. ఇప్పటికే పిల్లలకు అవసరమైన పుస్తకాలు, యూనిఫారాలు, బ్యాగులు, బెల్టులు, బూట్లు, సాక్సులను అప్పులు చేసి కొనుగోలు చేశాను. గత ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే నా బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ అయ్యేది. ఈ ప్రభుత్వం డబ్బులు ఎప్పుడు ఇస్తుందో తెలియడం లేదు. కూటమి నాయకుల మాటలు నమ్మి ఓట్లు వేసి మోసపోయాం.

– శ్రీరమ్య, పెదగంట్యాడ

జాబ్ క్యాలెండర్ విడుదల ఎప్పుడు?




అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఉద్యోగం లేకపోవడంతో నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్నాం.శిక్షణ తీసుకోవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. దీంతో పోటీపరీక్షలకు సన్నద్ధం కావడానికి ఆటంకం ఏర్పడుతుంది. వెంటనే ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు నియామకాలు సత్వరం జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఈలోగా హామీ ఇచ్చిన మేరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు చెల్లించి నిరుద్యోగులను ఆదుకోవాలి. – కణిశెట్ల ప్రవీణ్, నిరుద్యోగి

సూపర్‌సిక్స్ అమలు చేయాలి



అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వందరోజులు కావస్తున్నా ఇంత వరకూ ఒక పథకం అమలు చేయలేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పి ప్రజలను మోసం చేయాలని చూస్తోంది. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎన్నికల సమయంలో తెలియదా? అని ప్రశ్నిస్తున్నాం. ఆర్థిక పరిస్థితి బాగోకపోయినా, కోవిడ్ కుంగదీసినా మాజీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాటకు అనుగుణంగా నవరత్న పథకాలు అమలు చేసి చూపించారు. అదే మాదిరిగా కూటమి నాయకుల మాటలు నమ్మి మద్దతు తెలిపాం. సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలి. లేకుంటే సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలను వంచించినట్లే అవుతుంది.

– దేముడమ్మ,దువ్వాడ



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊరూ... వాడా ప్రచారం చేశారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సహాయం అన్నదాతా సుఖీభవ పథకం కింద అందజేస్తాం.. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ.15 వేలు తల్లికి వందనం పేరిట ఇస్తాం... ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం... నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇస్తాం.. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఖాతాలకు జమచేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని.. ఇలా తమ మేనిఫెస్టోలో చేర్చి భారీగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. అధికారంలోకి వచ్చి వందరోజులు కావస్తున్నా ఇంత వరకు ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నీ పక్కాగా అమలు చేసి అండగా నిలిచిందని గుర్తు చేసుకుంటున్నారు. బాబు ష్యూరిటీకి గ్యారంటీ లేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం కూడా సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయాల్సిందేనని గాజువాక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

– సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్


– గాజువాక/అగనంపూడి/పెదగంట్యాడ

ప్రతి మహిళలకు నెలకు రూ.1500



మహిళలకు ప్రతినెలా రూ.1500
మొత్తం లబ్ధిదారులు : 1,41,254
నెలకు ఇవ్వాల్సిన సాయం : 21.18 కోట్లు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



మొత్తం లబ్ధిదారులు
1,66,487

ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు



మొత్తం లబ్ధిదారులు : 1,34,655
ఇవ్వాల్సిన సిలిండర్లు : 4,03,965
అందాల్సిన సాయం : రూ.32.80 కోట్లు

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి



మొత్తం లబ్ధిదారులు : 30,000
నెలకు ఇవ్వాల్సిన సాయం : రూ. 90 కోట్లు

ప్రతి తల్లికి రూ.15 వేలు తల్లికి వందనం



పిల్లలను స్కూళ్లకు పంపిస్తున్న తల్లులు
76,000
అందించాల్సిన 'తల్లికి వందనం' సాయం
రూ.114 కోట్లు

ఉచిత సిలిండర్ల అమలుకూ కాలయాపనే!



ప్రతీ ఇంటికీ ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. ఎన్నికల హామీలో భాగంగా చంద్రబాబు, కూటమి నాయకులు ప్రచార సభల్లో ఊదరగొట్టారు. అధికారం వచ్చి వంద రోజులు కావస్తున్నా అమలుకు నోచుకోలేదు.పథకం అమలుకు మార్గదర్శకాలు కూడా జారీ చేయలేదు. – బి.సత్యనారాయణ,

ఉచిత బస్సు విధివిధానాలేవి?



టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మాటేంటి. అధికారం చేపట్టి వందరోజులు కావస్తోంది. అయినా హామీ అమలు చేయలేదు. ఏ బస్సుల్లో ప్రయాణం కల్పిస్తారు.. అర్హత ఏంటి వంటి వివరాలు వెల్లడించలేదు. డీఎస్సీ మాదిరిగా కాలయాపన చేయకుండా కచ్చితంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి.

– పి. రమణ, నిర్వాసితకాలనీ


అన్నదానంతో సంతృప్తి



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న అని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 75వ వార్డు పెదకోరాడ గ్రామంలో వినాయక యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అన్న సమారాధనను వంశీరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీల సభ్యులు గొందేశి వెంకటరమణారెడ్డి, బసా ఆనంద్‌రెడ్డి, సీర శ్రీనివాసరెడ్డి, నీలాపు నవీన్‌రెడ్డి, మద్ది అరుణకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన




పూజలు చేస్తున్న రఘువీరానంద, డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు

ఉక్కునగరం: చిన్మయమిషన్ ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో నంగినాపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన దంత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఉక్కు జనరల్ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 200 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి దంత వైద్యురాలు డాక్టర్ స్వరూప దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిన్మయ మిషన్ ఉక్కునగరం శాఖ అధ్యక్షుడు రఘువీరానంద విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదగడానికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి జనరల్ మేనేజర్ డాక్టర్ ఎ.పి. నవీన్‌కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త వై. వెంకన్నచౌదరి, చిన్మయ మిషన్ కార్యదర్శి జయంతి కుమార్, ప్రధానోపాధ్యాయుడు ఆర్.వి. జగదీష్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో బాలుడి అరెస్ట్

అక్కిరెడ్డిపాలెం: దొంగతనం కేసులో బుధవారం బాలుడిని అరెస్ట్ చేసి అతని నుంచి రూ.24,500 నగదుతో పాటు సెల్ ఫోను స్వాధీనం చేసుకున్నట్టు గాజువాక క్రైం సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. గాజువాక చైతన్యనగర్‌కు చెందిన బొబ్బర శ్రీనివాసరావు, వరలక్ష్మి పిల్లలతో నివాసం ఉంటున్నారు. శ్రీనివాసరావు, లక్ష్మి ప్రైవేట్ స్కూల్లో టీచర్లుగా పని చేస్తున్నారు. వీరు విధులకు వెళ్లే సమయంలో, పిల్లలు కళాశాలకు వెళ్లిన తర్వాత ఇంటి తాళాలను షూ స్టాండ్ కింద పెట్టేవారు. ఈ నెల 13న కుమారుడు వినాయక చవితి మండపం వద్ద ఉండిపోవడంతో అతనికి మారుతాళం ఇచ్చి మరో తాళాన్ని షూ స్టాండ్ కింద ఉంచి వెళ్లిపోయారు. కుమార్తె మధ్యాహ్నం 3.45 గంటలకు ఇంటికి వచ్చిందితింట్లోకి వెళ్లేసరికి అల్మరా తెరిచి ఉండడంతో పరిశీలించింది. అందులోని రూ.5 వేలు పోయినట్టు గుర్తించింది. వెంటనే వీరు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ మన్మథరావుతో కూడిన క్రైం స్పెషల్ బృందం దర్యాప్తు చేసిగొంతినవానిపాలేనికి చెందిన బాలుడి(17) పూర్తి సమాచారం సేకరించింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు గాజువాక సీఎంఆర్ సెంట్రల్ వద్ద ఆ బాలుడిని అరెస్ట్ చేశారు. గాజువాక చైతన్యనగర్‌లోని విద్యావికాష్ జూనియర్ కళాశాలలో కూడా నగదు దొంగతనం చేశాడని పోలీసులు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో చెడు వ్యసనాలకు బానిసై చదువు మానేసి దొంగతనాలకు పాల్పడుతున్నాడని తెలిపారు.

అక్రమ బదిలీలు ఆపాలి



మాట్లాడుతున్న రామారావు

అగనంపూడి: విశాఖ ఉక్కులోని మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో రెండింటిని మూసివేయడం, తర్వాత ఇక్కడి అధికారులను వేరే స్టీల్‌ప్లాంట్‌కు బదిలీ చేయడం చూస్తుంటే కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కుపై కుట్రలు చేస్తుందని స్పష్టమవుతోందని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకుడు ఎస్. రామారావు ఆరోపించారు. కూర్మన్నపాలెంలో చేపట్టిన 1315వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. కేంద్ర పాలకులు ఒక్కొక్కరు ఒక్కోలా మాట్లాడి కార్మికులను ఆందోళనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఉక్కు అధికారుల అక్రమ బదిలీలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీటు నాయకులు డీసీహెచ్.వెంకటేశ్వరరావు, యు.వెంకటేశ్వరరావు, పెదిరెడ్ల నీలకంఠం, వి.ప్రసాద్, రమణమూర్తి, వరసాల శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహన్‌కుమార్, శ్రీనివాస్, కె.సత్యనారాయ, మధు, పట్టా రమేష్, సంజీవరావు, పీజీకె రాజు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృత దేహం

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌కు సమీపంలోని క్రాసింగ్ వంతెన వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని దువ్వాడ జీఆర్పీ ఔట్ పోస్ట్ పోలీసులు గుర్తించారు. జీఆర్పీ ఎస్‌ఐ లక్ష్మి తెలిపిన వివరాలు.. సుమారు 25 నుంచి 30 ఏళ్ల వ్యక్తి మృతదేహం దువ్వాడ రైల్వే క్రాసింగ్ వద్ద ఉన్న ఫ్లైఓవర్ వంతెన కింద పట్టాలపై పడి ఉంది. మృతుడి వివరాలు లభ్యం కాలేదు. నలుపు, ఆరంజ్ రంగుల్లోని ఫుల్ హ్యాండ్స్ టీ షర్ట్, నలుపు రంగు ట్రాక్ ధరించి ఉన్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుడి వివరాల తెలిసిన 73820 58996 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

మొక్కల పెంపకం అవశ్యం

అగనంపూడి: కాలుష్య భూతాన్ని తరిమికొట్టడానికి మొక్కలు నాటడం ఒక్కటే మార్గమని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. అగనంపూడి శ్మశాన వాటికలో బుధవారం జీవీఎంసీ సమకూర్చిన మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు గళ్ల రాజు, బి.సత్యనారాయణ,చందు రమేష్ పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్ సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ కోసం 4వ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ కె. ఎస్. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26 లోగా ఐటీఐ.జీవోవీ.ఇన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 28న మధ్యాహ్నం 2గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజువాక: కర్ణవానిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సుందరయ్య కాలనీ ఫీడర్‌లో శుక్రవారం నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. సుందరయ్య కాలనీ, అఫీషియల్ కాలనీలోని రోడ్ నంబర్ 3 నుంచి 6 వరకు, శ్రీనగర్ దిబ్బపాలెం కాలనీ, కృష్ణదేవరాయనగర్, పాతకర్ణవానిపాలెం ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మస్తానప్పను పరామర్శించిన నాగిరెడ్డి

ఉక్కునగరం: శస్త్ర చికిత్స చేయించుకున్న స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ ప్రధానకార్యదర్శి వై. మస్తానప్పనుగా బుధవారం మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పరామర్శించారు. మస్తానప్ప ఇటీవల అనారోగ్యం గురవడంతో పాటు మోకాలుకు సర్జరీ చేయించుకున్నారు. విషయం తెలిసి నాగిరెడ్డి టౌన్‌షిప్‌లోని మస్తానప్ప క్వార్టర్‌కు వెళ్లి కలిశారు. ఆయన త్వరగా కోలుకొని కార్మికులకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 87వ వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద పాల్గొన్నారు.

గాజువాక ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ రాధాకృష్ణ

అక్కిరెడ్డిపాలెం: గాజువాక లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐగా ఎం.రాధాకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సైబర్ క్రైం పీఎస్ ఎస్‌ఐగా పని చేస్తూ బదిలీపై విచ్చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని వివరించారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



అబ్బాయిని సత్కరిస్తున్న నాయకులు

గాజువాక: మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే లక్ష్యంగా తమ సంఘం పని చేస్తుందని జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు తెలిపారు. ఆ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గంటా అబ్బాయిని బుధవారం సత్కరించారు. మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చింతకాయల ముత్యాలు, పిక్కి కొర్లయ్య, సూరాడ రాజు, అర్జిల్లి దాసు పాల్గొన్నారు.

ఖోఖోలో ఢిల్లేశ్వరి ప్రతిభ



సర్టిఫికెట్ అంటుకుంటున్న ఢిల్లేశ్వరి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆర్. ఢిల్లేశ్వరి అండర్ –14 ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. బాపట్ల జిల్లా జె. పంగులూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖ నుంచి పాల్గొని సత్తాచాటిందని పాఠశాల పీడీ ఇస్మాయిల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీశ్వరికి సర్టిఫికెట్‌ను స్కూల్ హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం అందజేశారు.

చిరుతపులి కాదు.. పునుగు పిల్లి



రైల్వే గేటు వద్ద కనిపించిన పునుగుపిల్లి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రైల్వే గేటు పరిసర ప్రాంత్లా చిరుతపులి సంచరిస్తుందన్న సమాచారం స్థానికంగా అలజడి రేకెత్తించింది. రైలు లోకో పైలట్ చూశారని అటుగా వస్తున్న వారికి ఈ విషయం చెప్పారని నైట్ షిఫ్టుకు వెళ్లే ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు వినిపించాయి. ఈ నేపథ్యంలో సమాచారం వచ్చిన ఫొటో చూస్తే అది చిరుతపులి కాదని.. అతి అరుదుగా కనిపించే పునుగుపిల్లి అని తెలుసుకుని ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

జీవీఎంసీ కమిషనర్ దృష్టికి సమస్యలు



జీవీఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ చందు

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డులోని ప్రధాన సమస్యలపై వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు బుధవారం జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నగరంలోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిసిన చందు వార్డులో రోడ్ల సమస్యలు, వీధిదీపాల సమస్యలను వివరించారు. కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని కోరారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన



కాంట్రాక్ట్ కార్మికుల ధర్నాలో ప్రసంగిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల (సీఐటీయూ మినహా) ఆధ్వర్యంలో బుధవారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ బయోమెట్రిక్ ప్రవేశపెట్టినప్పుడు కేవలం ప్రవేశానికి మాత్రమే అని చెప్పిన యాజమాన్యం ఇప్పుడు దాని ఆధారంగా అటెండెన్స్ ఇస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. గేట్ల వద్ద బయోమెట్రిక్ మిషన్లు పని చేయకపోతే కార్మికుల తప్పా అని వారు ప్రశ్నించారు. బయోమెట్రిక్ అటెండెన్స్ తొలగించి విభాగాల్లోని పాత పద్ధతి కొనసాగించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్, హెచ్ఆర్ జీఎం ఎస్.భానులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మంత్రి రవి, పి.వి. నగేష్, భాస్కరరావు, బొడ్డు రాజేష్‌యాదవ్, వేణుగోపాల్, , యు. అప్పారావు, పిట్టారెడ్డి, శశిభూషణ్ పితాని భాస్కర్, ఉమ్మిడి అప్పారావు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌తో సమావేశం వాయిదా

ఉక్కునగరం: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో గురువారం జరగాల్సిన ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, స్టీల్‌ప్లాంట్ యువ కార్మికుల సమావేశం వాయిదా పడింది. స్టీల్‌ప్లాంట్ పరిస్థితిని పవన్ కల్యాణ్‌కు వివరించేందుకు స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు, పోరాట కమిటీ నాయకులు మంగళగిరిలో ఆయన్ను కలవాలని నిర్ణయించారు. అయితే పవన్ మూడు రోజుల పాటు బిజీగా ఉన్నందున మంగళగిరి రావద్దని, వారంలో సమావేశం ఏర్పాటు చేస్తామని జనసేన నాయకులు కోన తాతారావు చెప్పినట్లు పోరాట కమిటీ కన్వీనర్ కె.ఎస్.ఎన్. రావు తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

అగనంపూడి: తల్లులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారం అందిస్తున్న లీఫార్మా సంస్థ డైరెక్టర్ ఆళ్ల లీలారాణి సేవలు ఎనలేనివని దువ్వాడ వీఎస్ఈజెడ్ డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి అన్నారు. దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నెల రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు సమతుల్య ఆహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించినట్టు చెప్పారు.